RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | సంపుటి : 4, సంచిక : 43 | మంగళవారం జనవరి 20, 2026 | పేజీలు : 6 | వెల : రూ.3-00



4లో..

**పోష్ యాక్ట్ 2013ను కచ్చితంగా అమలు చేయాలి**

# మురిసిన వనం..!


▸రూ.250 కోట్లతో మేడారం శాశ్వత అభివృద్ధి ▸చరిత్రలో నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం



- గత సర్కార్ హయాంలో అన్నీ తాత్కాలిక పనులే
- ఈసారి ఆదివాసీ గిరిజన జాతర కోసం భారీ ఏర్పాట్లు
- చారిత్రక ఘట్టంగా మేడారంలో కేబినెట్ మీటింగ్
- పలు కీలక నిర్ణయాలకు ఆమోదం
- జాతర అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు
- తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పణ
- అన్నీ నడిపించిన మంత్రులు పొంగులేటి, సీతక్క
- జాతరకు పదిరోజుల ముందే పనులు పూర్తి.. ప్రారంభోత్సవం
- ఈసారి గిరిజన కుంభమేళాకు 3 కోట్లకు పైగా భక్తులు వచ్చే అవకాశం
- భారీ భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు చేసిన పోలీసులు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

ఆదివాసీల కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఈసారి సరికొత్త చరిత్రను లిఖించనుంది. గత ప్రభుత్వాలు ప్రతి జాతర సమయంలో తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితమవుతూ వచ్చేది. దీనికి పూర్తి భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం మేడారాన్ని శాశ్వత అభివృద్ధి దిశగా నడిపించి కొత్త రూపాన్ని అందించింది. తెలంగాణ కుంభమేళాగా గుర్తింపు పొందిన ఈ మహాజాతరకు మునుపెన్నడూ లేని స్థాయిలో రూ.250 కోట్లకు పైగా నిధులు కేటాయించి, పనుల్లో నాణ్యత, సౌకర్యాలు, ఆదివాసీ సంప్రదాయాలకు గౌరవం అన్నింటినీ సమన్వయం చేస్తూ మేడారం ముఖచిత్రాన్నే మార్చేసింది. తాత్కాలిక షెడ్లు, పైపై పనులు, హడావుడి ఏర్పాట్లకు స్వస్తి పలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం శాశ్వత గద్దెలు, స్నాన ఘట్టాలు, ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించే తోరణాలు, శిల్పాలతో మేడారాన్ని ఒక అద్భుత ఆధ్యాత్మిక-పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దింది. గతంలో జాతర పేరుతో నిధులు వృథా అయ్యాయనే విమర్శలకు తెరదించుతూ, ఈసారి గిరిజన మహాజాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది.



3లో..



వేద న్యూస్ తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను సోమవారం ఆవిష్కరిస్తున్న ఇల్లందకుంట ఎస్ఐ ఎం.క్రాంతి కుమార్, వేద న్యూస్ సీనియర్ జర్నలిస్టు అంబీర్ శ్రీకాంత్ తదితరులు



వేద న్యూస్ తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను సోమవారం ఆవిష్కరిస్తున్న ఇల్లందకుంట మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ మధుకర్, వేద న్యూస్ సీనియర్ జర్నలిస్టు అంబీర్ శ్రీకాంత్ తదితరులు

## ప్రజా సంక్షేమమే ధ్యేయం..

- సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్నం
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం
- స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు
- మంత్రి గడ్డం వివేకానంద

**వేద న్యూస్, మంచిర్యాల:**



ప్రజలతో మమేకమై ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం చెన్నూర్ మండల కేంద్రంలో రూ.47.11 కోట్లతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

మిగతా 3వ పేజీలో..

## పల్లెపాలనపై అవగాహన పాఠాలు

- నూతన సర్పంచులకు శిక్షణ తరగతులు
- వచ్చే నెల 27 వరకు కార్యక్రమం
- పంచాయతీ రాజ్ చట్టాలపై చైతన్యం



**వేద న్యూస్, మెదక్:**

నూతనంగా ఎన్నికైన సర్పంచులకు పల్లెపాలనపై అవగాహన కల్పించడంతో పాటు పంచాయతీరాజ్ చట్టాలపై చైతన్యం కలిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం నుంచి మెదక్ జిల్లాలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. అందరికీ ఒకేసారి కాకుండా ఒక్కో బ్యాచ్‌లో 50 మంది చొప్పున రెండు తరగతులుగా శిక్షణ ఇవ్వనున్నారు. ఐదు విడతలుగా చేపట్టే ఈ శిక్షణ కార్యక్రమం వచ్చే నెల 27 వరకు కొనసాగనుంది. జిల్లాలోని మొత్తం 492 మంది సర్పంచుల్లో 235 మంది మహిళలు, 257 మంది పురుషులు ఉన్నారు. ఎన్నికైన వారిలో అత్యధిక శాతం కొత్తవారే కావడం విశేషం.

**మొత్తం 24 అంశాలపై శిక్షణ**

గ్రామపాలన వ్యవస్థలు, నూతన పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం పంచాయతీల అధికారాలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు తదితర మొత్తం 24 అంశాలపై సర్పంచులకు అవగాహన కల్పించనున్నారు. జిల్లా కేంద్రం మెదక్‌లోని బోధన్ చౌరస్తా వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ క్యాంపస్)లో ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. గ్రామసభల నిర్వహణ, పంచాయతీ సమావేశాలు, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, వీబీజీఆర్ఎంజీ పథకం, వ్యవసాయం, జనన--మరణాల నమోదు, ఈ-అప్లికేషన్, పంచాయతీరాజ్ ఈ-పాలన, ఆర్థికాభివృద్ధిలో గ్రామపంచాయతీల పాత్ర, కేంద్ర ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌సీ నిధుల వినియోగం, ఖర్చు తదితర అంశాలపై విపులంగా వివరించనున్నారు. ఈ కార్యక్రమం కోసం జిల్లాలోని ఎనిమిది మంది టీవోటీలు (ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్) తర్ఫీదు పొందారు. వీరే సర్పంచులకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతిరోజూ సర్పంచుల హాజరు నమోదు చేయనున్నారు. అనంతరం ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు డివిజన్, మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**- రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి**

**వేద న్యూస్, వనపర్తి ప్రతినిధి :**

మహిళా సంక్షేమంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా మహిళలని ఆర్థికంగా బలోపేతం చేసి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని స్థానిక దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ నందు మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు, ఇందిరమ్మ చీరల పంపిణీ చేసేందుకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అధ్యక్షతన ఇందిర మహిళా శక్తి సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి,

మిగతా 3వ పేజీలో..



వేద న్యూస్
మంగళవారం జనవరి 20, 2026

# గురుకుల కామన్ విద్యావిధానం తీసుకురావాలి



**వేద న్యూస్, సిద్దిపేట :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న తెలంగాణ విద్యా బిల్లులో కామన్ గురుకుల విద్యా విధానాన్ని చేర్చాలని తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ డిమాండ్ చేసింది. సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐదు సొసైటీల రాష్ట్ర కమిటీ సభ్యులు టీజీపిఏ సెంట్రల్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ రౌతు అజయ్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా పైళ్ళ ప్రకాష్ రెడ్డి ఉపాధ్యక్షులుగా టి శ్రీలత, జాయింట్ సెక్రటరీగా దుర్గా రెడ్డి , సురభి చైతన్య వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి కోశాధికారి జక్కని రాజేశం, అసోసియేట్ ప్రెసిడెంట్ తనుగుల శ్రీనివాస్, అధికార ప్రతినిధి గంద్ర శ్రీకాంత్, కేంద్రీయ కార్యాలయ కార్యదర్శిగా గన్నెబోయిన బిక్షపతి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రౌతు అజయ్ కుమార్ మాట్లాడుతూ సమీకృత గురుకుల విద్యా విధానం స్ఫూర్తి తో కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినప్పుడు గురుకుల విద్యా వ్యవస్థలో గుణాత్మకమైన మార్పు వస్తుందన్నారు. ఎంతో ఒత్తిడితో పనిచేస్తున్న గురుకుల సిబ్బందికి హెల్త్ కార్డులు కూడా మంజూరు చేయాలని కోరారు. 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమంలో జనరల్ గురుకుల వింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, మైనారిటీ వింగ్ ప్రెసిడెంట్ జితేందర్, సోషల్ వెల్ఫేర్ వింగ్ ప్రెసిడెంట్ సంతోష్, బీసీ వెల్ఫేర్ వింగ్ ప్రెసిడెంట్ తాడురి రవీందర్, ఉదయ్ కుమార్, వస్కుల రాజు, బాలకృష్ణ, చందర్ రెడ్డి, రాధా, తదితరులు పాల్గొన్నారు.

# రక్త పరీక్షల పేరిట దోపిడీ మానుకోవాలి



- కార్మికుల సంక్షేమాన్ని ప్రైవేట్ పరం చేయొద్దు
- లేబర్ వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలి
- ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలను రద్దు చేయాలి
- కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని..: సీఐటీయూ

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న పథకాలపై సీఐటీయూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలు, శాశ్వత, పాక్షిక అంగవైకల్యానికి సంబంధించిన నాలుగు స్కీమ్‌లను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 12ను విడుదల చేసిందని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. జీవో విడుదల చేసిన రెండు రోజులకే క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.250 కోట్లు, ఏర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.94 కోట్లు, ట్రయిల్-బ్లేజర్ అనే బ్రోకర్ సంస్థ ద్వారా మొత్తం రూ.346 కోట్లు ప్రైవేటు బీమా కంపెనీలకు అక్రమంగా బదిలీ చేశారని ఆరోపించారు. ఇది 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం నిబంధనలకు విరుద్ధమని, ఈ చర్యను సీఐటీయూ దుర్మార్గ చర్యగా భావిస్తోందని తెలిపారు. కార్మికులకు అవసరం లేని సీఏస్సీ సంస్థ హెల్త్ టెస్టుల పేరిట వెల్ఫేర్ బోర్డు నిధులను దుబారా చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఈ హెల్త్ టెస్టులను రద్దు చేసి, కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్-12ను సవరించి, ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు కాకుండా ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అక్రమంగా బీమా కంపెనీలకు బదిలీ చేసిన రూ.346 కోట్లను తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెన్యువల్ కాని 13 లక్షల మంది కార్మికులకు వెల్ఫేర్ బోర్డు కార్డులను యుద్ధ ప్రాతిపదికన వెంటనే రెన్యువల్ చేయాలని, అలాగే కార్మికులను రక్త పరీక్షల పేరిట భయభ్రాంతులకు గురి చేసే దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ భవన నిర్మాణ సంఘం ఉపాధ్యక్షులు గురిజాల శ్రీధర్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎడపల్లి బాబు, బొజ్జ శీను, రెడ్డివేని కనకయ్య, బొడ్డు రాజలింగం, బొడ్డు చిరంజీవి, ఎడపల్లి రాజు, బొడ్డు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న వైరా ఎమ్మెల్యే

**వేద న్యూస్, కారేపల్లి:**



తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర భక్తికి నిలువుటద్దంగా నిలుస్తోంది. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సోమవారం కుటుంబ సమేతంగా మేడారం చేరుకుని వన దేవతలను దర్శించుకుని మొక్కలు చెల్లించారు. మేడారం చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ పూజారులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాందాస్ నాయక్ గద్దెలపై కొలువై ఉన్న వనదేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజల క్షేమం కోసం ప్రార్థించారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వనదేవతల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై, వైరా నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నానని, అమ్మవార్ల దయతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అభివృద్ధి పథంలో నియోజకవర్గం ముందుకు సాగాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నిమగ్నమైన సర్పంచ్

**వేద న్యూస్, సింగరేణి:**

మండలంలోని రావోజీ తండా గ్రామపంచాయతీ పరిధిలో కొలువై ఉన్న మినీ సమ్మక్క-సారలమ్మ దేవాలయ ప్రాంగణం భక్తుల కోసం సర్వాంగ సుందరంగా తయారవుతోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ బాలు నాయక్, అధికారులు పర్యవేక్షణలో సోమవారం దేవాలయ పరిసరాల్లో ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయ కమిటీ పిలుపు మేరకు లోపల భక్తుల సౌకర్యార్థం మట్టి పోయడంతో అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తగ్గి ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించిన ఆయన, గ్రామపంచాయతీ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులతో సమన్వయంతో పంచాయతీ ట్రాక్టర్ సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షితమైన ఎత్తుకు పెంచి కనెక్షన్ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో భక్తులకు నిరంతర విద్యుత్ సరఫరాకు మార్గం సుగమమైంది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భారీగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేకంగా ట్యాంకర్లను ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరులు సర్పంచ్ బాలు



నాయక్, ఉపసర్పంచ్ సావిత్రి, ఆలయ పూజారి పాల్గొన్నారు. అలాగే దాతలు కాళ్లపాక నాగేశ్వరరావు-అరుణ దంపతులు, గ్రామస్తులు నాగేశ్వరరావు, రవి, పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది రాజు, శ్రీను తదితరులు పాల్గొని పనులను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలు నాయక్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో భక్తులకు ఎటువంటి లోటు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, పారిశుధ్యం, భద్రత విషయంలో రాజీ పడకుండా గ్రామపంచాయతీ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు.

# లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే



**వేద న్యూస్, కారేపల్లి:**

వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ సోమవారం ఏన్కూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో రాములు నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని, అందరికీ నరసింహస్వామి కృపాకటాక్షాలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బానోత్ సురేష్ నాయక్, భుక్యా వినోద్ కుమార్, ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయ పరిసరాల్లో రాములు నాయక్ స్థానిక భక్తులతో ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పర్యటనతో గార్లఒడ్డు ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది.

# 24వ వార్డు కౌన్సిలర్ రేసులో అరికిల్ల స్రవంతి

- తెలంగాణ జనసమితి పార్టీ అభ్యర్థిగా ..




**వేద న్యూస్, జమ్మికుంట:**

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జమ్మికుంట పట్టణంలోని 24వ వార్డు నుంచి తెలంగాణ జనసమితి పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నానని పార్టీ రాష్ట్ర నాయకురాలు అరికిల్ల స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు ప్రజలు ఆశీర్వదించి ఒక అవకాశం కల్పిస్తే, 24వ వార్డు రూపురేఖలు మార్చి, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. కుల, మతాలకు అతీతంగా మహిళా అభ్యర్థిగా బరిలో నిలిచి, ప్రజల విశ్వాసంతో గెలిస్తే నిస్వార్థంగా ప్రజా సేవ చేయడమే నా లక్ష్యమని స్పష్టం చేశారు. 24వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, మహిళలు--యువత సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ప్రజలు ఆశీర్వదిస్తే తప్పకుండా విజయం సాధించి, నాయకురాలిగా కాదు -- సేవకురాలిగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ధీమా వ్యక్తం చేశారు. పైసల ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా, నిజాయితీగా, పారదర్శకంగా ప్రజా సేవ చేయడానికే పూర్తి సమయం కేటాయిస్తానని ఈ సందర్భంగా అరికిల్ల స్రవంతి పేర్కొన్నారు.

# ప్రజావాణి అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణి అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 109 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని ఆమె అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి దరఖాస్తుపై బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సెర్ప్‌లో సీసీగా విధులు నిర్వర్తిస్తూ మరణించిన ఉద్యోగి కుటుంబానికి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిహారం చెక్కును అందజేశారు. ఇల్లంతకుంట మండలానికి చెందిన సెర్ప్ సీసీ సదయ్య ఇటీవల మృతి చెందగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన భార్య మంద సరళకు స్త్రీనిధి ద్వారా రూ.1 లక్ష 50 వేల పరిహారం చెక్కును ఇంచార్జి కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ గీత, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, స్త్రీనిధి ఆర్ఎం భూ కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక హితాలు, చైతన్య గీతాలు

- సామాన్య ప్రజల భాషలో వేమన పద్యాలు
- ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ
- ఘనంగా యోగివేమన జయంతి



**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రజాకవి, తాత్వికవేత్త యోగివేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వేమన సామాన్య ప్రజల భాషలో పద్యాలు రాసిన ప్రజాకవిగా, సామాజిక సంస్కర్తగా తెలుగు సాహిత్యంలో గొప్ప స్థానం సంపాదించారని అన్నారు. మూఢనమ్మకాలు, కులవ్యవస్థ, సామాజిక అసమానతలను తీవ్రంగా ఖండిస్తూ నైతిక విలువలు, జీవన సత్యాలను బోధించిన మహానుభావుడని పేర్కొన్నారు. 'విశ్వదాభిరామ వినురవేమ' మకుటంతో సరళమైన ఆటవెలది పద్యాల్లో లోకజ్ఞానం, జీవన పరమార్థాన్ని వివరించారని, అందుకే వేమనను 'ప్రజాకవి', 'ఆంధ్ర కబీర్'గా పిలుస్తారని తెలిపారు. వేమన పద్యాలు నేటికీ ప్రజల్లో చైతన్యం నింపుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడల్ సోలార్ విలేజ్ ఎంపికకు ప్రణాళికలు

- గ్రామ స్థాయిలో సంపూర్ణ సోలరైజేషన్ లక్ష్యం
- విద్యుత్ ఖర్చుల భారం తగ్గించేందుకు ఎంతో ఉపయోగం
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని ఒక గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. భారత ప్రభుత్వ నూతన, పునరుత్పాదక శక్తి మంత్రిత్వ శాఖ ద్వారా అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన కింద జిల్లాలో ఇప్పటికే సోలార్ విద్యుత్ ఎక్కువగా వినియోగిస్తున్న గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం రెడ్కో, డీఆర్డీఓ, డీపీఓ, సెస్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో సంపూర్ణ సోలరైజేషన్, స్వచ్ఛ శక్తి వినియోగం, శక్తి స్వయం సమృద్ధిని ప్రదర్శించడమే మోడల్ సోలార్ విలేజ్ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఎంఎన్ఆర్ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాస్థాయి కమిటీ ఒక గ్రామాన్ని ఈ కార్యక్రమం అమలుకు ఎంపిక చేస్తుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అమలుకు తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ను నియమించారని వివరించారు. ఎంపికైన గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు వంటి సంస్థలకు విద్యుత్ ఖర్చుల భారం తగ్గించేందుకు సోలార్ పవర్ ఉపయోగపడుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన అన్ని ప్రతిపాదనలు, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.122.38 లక్షలు కాగా, ఇందులో రూ.100 లక్షలను కేంద్ర ఆర్థిక సహాయంగా ఎంఎన్ఆర్ఈ నుంచి కోరుతున్నట్లు, మిగిలిన రూ.22.38 లక్షలను గ్రామ పంచాయతీ వాటాగా సమకూర్చనున్నట్లు రెడ్కో అధికారులు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ గీత, రెడ్కో అధికారి లక్ష్మీ కాంతరావు, సెస్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, ఎల్డీఎం మల్లికార్జున రావు, డీపీఓ కార్యాలయ ఏవో నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మురిసిన వనం..!

▸రూ.250 కోట్లతో మేడారం శాశ్వత అభివృద్ధి ▸చరిత్రలో నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ☐ గత సర్కార్ హయాంలో అన్నీ తాత్కాలిక పనులే
- ☐ ఈసారి ఆదివాసీ గిరిజన జాతర కోసం భారీ ఏర్పాట్లు
- ☐ చారిత్రక ఘట్టంగా మేడారంలో కేబినెట్ మీటింగ్
- ☐ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం
- ☐ జాతర అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు
- ☐ తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పణ
- ☐ అన్నీ నడిపించిన మంత్రులు పొంగులేటి, సీతక్క
- ☐ జాతరకు పదిరోజుల ముందే పనులు పూర్తి.. ప్రారంభోత్సవం
- ☐ ఈసారి గిరిజన కుంభమేళాకు 3 కోట్లకు పైగా భక్తులు వచ్చే అవకాశం
- ☐ భారీ భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు చేసిన పోలీసులు



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

ఆదివాసీల కుంభమేళా మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఈసారి సరికొత్త చరిత్రను లిఖించనుంది. జాతర కోసం గత ప్రభుత్వాలు తాత్కాలిక పనులతో కాలక్షేపం చేయగా, పాత పద్ధతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్వస్తి పలికింది. శాశ్వత కట్టడాలతో మేడారం రూపురేఖలను మార్చివేసింది. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన ఈ జాతరకు మునుపెన్నడూ లేని విధంగా నిధుల వర్షం కురిపించడమే కాకుండా, పనుల్లో నాణ్యత, ఆదివాసీ సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ మేడారాన్ని ఒక అద్భుత ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దింది. గత ప్రభుత్వాలు జాతర సమయానికి హడావుడి చేసి, పైపై పనులతో నిధులు వృథా చేశాయనే విమర్శలు ఉండేవి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఈ మహాజాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మొత్తం రూ. 250 కోట్లకు పైగా నిధులు కేటాయించి, మేడారం ముఖచిత్రాన్ని మార్చేసింది.



**- శాశ్వత గద్దెలు.. స్నాన ఘట్టాలు**

ఈసారి జాతరకు వచ్చే భక్తులకు గద్దెల ప్రాంగణం ఒక సరికొత్త అనుభూతిని ఇస్తోంది. అమ్మవార్లు కొలువయ్యే గద్దెలను అత్యంత పవిత్రంగా, దృఢమైన గ్రానైట్తో పునర్నిర్మించారు. భవిష్యత్తులో ఎన్ని కోట్ల మంది భక్తులు వచ్చినా తట్టుకునేలా ఈ నిర్మాణాన్ని చేపట్టారు. మేడారంలో అడుగుపెట్టిన భక్తులకు స్వాగతం పలికేలా గంభీరమైన తోరణాలను నిర్మించారు. ఈ తోరణాలపై కేవలం రంగులు వేయడమే కాకుండా, ఆదివాసీల ఆచార వ్యవహారాలు, వారి ప్రాచీన సంప్రదాయాలు, సమ్మక్క-సారక్కల వీరగాథలను ప్రతిబింబించేలా అద్భుతమైన శిల్పాలను చెక్కారు. ఇవి చూస్తుంటే ఆదివాసీ చరిత్ర కళ్లముందు కదలాడుతుంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే జంపన్న వాగు వద్ద శాశ్వత స్నాన ఘట్టాలను నిర్మించి, సుందరీకరణ పనులు పూర్తి చేశారు.

**- వనంలో కేబినెట్ భేటీ!**

మేడారం చరిత్రలో నిలిచిపోయే మరో ఘట్టం 18వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశం. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా దట్టమైన అరణ్యంలో, అది కూడా గిరిజన కుంభమేళా జరిగే మేడారంలో కేబినెట్ భేటీ జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో మేడారం అభివృద్ధికి మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, జాతర ఏర్పాట్లపై మంత్రులంతా సంతృప్తి వ్యక్తం చేశారు.



**- అభివృద్ధి పనులకు సీఎం ప్రారంభోత్సవం**

19వ తేదీన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తాను కలలుగన్న సరికొత్త మేడారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. శాశ్వత గద్దెల ప్రాంగణాన్ని ప్రారంభించిన అనంతరం, తన కుటుంబ సభ్యులతో కలిసి సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి తన నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పేలా మేడారాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**- మంత్రులు పొంగులేటి, సీతక్క పట్టుదల..**

మేడారం అభివృద్ధిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క కీలక పాత్ర వహించారు. జాతర పనులు మొదలైన నాటి నుంచి ఈ ఇద్దరు మంత్రులు మేడారాన్ని తమ సొంత ఇలాకాగా భావించి నిరంతరం పర్యవేక్షించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎప్పటికప్పుడు అధికా రులకు దిశానిర్దేశం చేసి సమయానికి పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకున్నారు. అడవి బిడ్డగా, స్థానిక మంత్రిగా సీతక్క ఆదివాసీల మనోభావాలు దెబ్బతినకుండా ప్రతి అడుగు లోనూ జాగ్రత్తలు తీసుకున్నారు.

**- భారీ భద్రత.. ఏర్పాట్లు**

ఈ ఏడాది జాతర ప్రారంభం కాకముందే లక్షలాది మంది భక్తులు తరలివస్తుండటం విశేషం. జాతర ముగిసేసరికి ఈ సంఖ్య 3 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా, జాతరలో క్రౌడ్ మేనేజ్మెంట్ కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. డ్రోన్లు, నిఘా కెమెరాలు, డిజిటల్ కంట్రోల్ రూమ్స్ ద్వారా భక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, పారిశుధ్యం విషయంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. వేల సంఖ్యలో సిబ్బందిని నియమించి ఎక్కడా భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలో మహిళలకు ఇందిరా మహిళా శక్తి లో భాగంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా 2023-24, 2024-25 కి సంబంధించి 529 సంఘాలకు గానూ రూ. 1.60 కోట్ల వడ్డీ లేని రుణాలను మంజూరు చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేళ్ల కిందట కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన డిసెంబర్ 9న మొదటి సంతకం మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ఫైల్ మీద చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు సారె పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా .. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చీరలు వారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని చెప్పారు. మహిళా సంఘం సభ్యులకు ప్రతి ఒక్కరికి ఈ చీరలు చేరుతాయని తెలిపారు. 18 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి మహిళా సంఘం సభ్యులకు ఉచితంగా ఒక చీర ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళకు ఇస్తున్న చీరలు చాలా నాణ్యమైనవని, రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని సంకల్పంతో నేడు రాష్ట్రంలో అన్ని స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేకుండా రుణాలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. మహిళలు ఆర్థికంగా బలంగా ఉంటేనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని నమ్మిన సీఎం రేవంత్ రెడ్డి నేడు మహిళల ఉన్నతి కోసం ఎన్నో కార్యక్రమాలను తీసుకువస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో మహిళలకు పావలా వడ్డీ రుణాన్ని తీసుకువచ్చారని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి మంది మహిళలని కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, స్వయం సహాయక బృందాలకు వడ్డీ లేని రుణాలు, రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేశామన్నారు. నేడు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను సమకూర్చే ఉన్నత బాధ్యతలను మహిళలకు అప్పచెప్పమన్నారు. వనపర్తి లో రూ. 5 కోట్లతో మహిళా సంఘాలకు భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గతంలో ఉన్న ప్రభుత్వం పదేళ్లపాటు ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వడం మరిచిపోయిందని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తుందని చెప్పారు. వనపర్తి పట్టణంలో 60 కోట్ల రూపాయలతో గల్లి గల్లీలో సిసి రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు ఆరోగ్య సేవలను రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచామన్నారు.రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు బ్యాంకుల్లో పిలిచి మరి రుణాలు ఇస్తున్నారని తెలిపారు. మహిళల కోసం అత్యధిక సంక్షేమ పథకాలను కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని కొనియాడారు. ఇల్లు లేని ప్రతి ఒక్క నిరుపేద మహిళ పేరుమీద ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయం..

జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేకానంద మాట్లాడుతూ.. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో రూ.40 కోట్లతో అంతర్గత రహదారులు, డ్రైనేజీ పనులు చేపట్టామని, అర్హులకు రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా నిరుపేదలకు ఇండ్లు కేటాయిస్తున్నామని, సోమనపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కొనసాగుతోందన్నారు. అలాగే 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల త్యాగాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా తర్ఫీదు ఇస్తామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభించేలా పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన ఒగ్గు రమేష్

- కండువా కప్పి ఆహ్వానించిన ప్రణవ్..



**వేద న్యూస్, జమ్మికుంట:**

మున్సిపల్ ఎన్నికల ముందు కాంగ్రెస్ లోకి వలసల జోరు పెరుగుతున్నది. సోమవారం జమ్మికుంట పట్టణానికి చెందిన ఒగ్గు రమేష్ కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్లో చేరారు. ప్రణవ్ సమక్షంలో ఆయన మూడు రంగుల జెండా కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రజాసంక్షేమ పాలనకు ఆకర్షితుడనై పార్టీలో చేరినట్టు రమేశ్ వెల్లడించారు.

## జిమ్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**వేద న్యూస్, చిన్న చింతకుంట :** చిన్న చింతకుంట మండల కేంద్రంలో క్యూ,ఎఫ్, ఫిట్నెస్ వరల్డ్ జిమ్ ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేసిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబెర్స్ లు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్న చింతకుంట మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జియంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వేద న్యూస్

మంగళవారం జనవరి 20, 2026

# ప్రజల కోసమే పోలీస్ వ్యవస్థ

- చట్టపరంగా న్యాయం అందిస్తాం
- పైరవీలు వద్దు.. నేరుగా వచ్చి కలవండి
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందు బాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు కోరారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వివాదాలు, పోలీసు సంబంధిత ఇబ్బందులను నేరుగా ఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను పూర్తిగా తెలుసుకున్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే స్పందిస్తూ సంబంధిత సర్కిల్ ఇన్ స్పెక్టర్లు, సబ్ ఇన్ స్పెక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కొన్ని కేసుల విషయంలో సంబంధిత ఎస్ హెచ్ ఓలతో ఫోన్ లో మాట్లాడి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని, ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని పిలుపునిచ్చారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరిగిందని ఎస్పీ తెలిపారు.

# జీపీ రికార్డులను తనిఖీ చేసిన ఎంపీఓ

- మల్లెల రవీంద్రప్రసాద్



**వేద న్యూస్, కారేపల్లి:**

మండలంలోని భాగ్యనగర్ తండా గ్రామ పంచాయతీని సోమవారం మండల పరిషత్ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రామ పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పరిపాలన తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్శనలో భాగంగా ఎంపీఓ గ్రామ పంచాయతీకి సంబంధించిన కీలక రికార్డులు, నిధుల వినియోగం, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిధులు ప్రతి పైసా పారదర్శకంగా ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని, రికార్డులను ఎప్పటికప్పుడు అప్ డేట్‌గా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల పరిస్థితి, మిషన్ భగీరథ నీటి సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాలపై పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన పనులు నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, పంచాయతీ సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా

- అమనగల్లు సర్పంచ్ పిల్లల సందీప్



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామం లో సోమవారం ఉదయం సర్పంచ్ పిల్లల సందీప్ ఆధ్వర్యంలో తొలి గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సయ్యద్ జానీ గ్రామంలో నెలకొన్న సమస్యలపై నివేదికను సభకు సమర్పించారు. గ్రామ సభలో వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ శాఖలకు సంబంధించిన అంశాలు, సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిల్లల సందీప్ మాట్లాడుతూ.. గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్ర భవనం మంజూరైనట్లు, అలాగే మహిళా సంఘ భవనం కూడా ప్రభుత్వం నుంచి మంజూరు అయినట్లు తెలిపారు. గ్రామాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమం సర్పంచ్ పిల్లల సందీప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపసర్పంచ్ శాలెం రాజు, హోమియోపతి డిస్పెన్సరీ వైద్యశాల డాక్టర్ భవాని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యోగేశ్వర్, గ్రామ రెవెన్యూ అధికారి లింగయ్య, వార్డు మెంబర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టేషనరీ సామాగ్రి, పండ్ల పంపిణీ



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కు చెందిన విద్యార్థి జన్ను బాశ్విక్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సోమవారం స్టేషనరీ సామాగ్రి, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భద్రు నాయక్ మాట్లాడుతూ బాశ్విక్ పుట్టినరోజు సందర్భంగా అనవసర ఖర్చులు చేయకుండా పేద విద్యార్థులకు సహాయం చేసిన ఆయన తల్లిదండ్రులు జన్ను సరిత - మధుకర్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రవీణ, సుధా, ఎన్టీఆర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్ స్థానిక నాయకులు ఈర్ల రాజు, బొల్లే సాంబయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# పోతుర్తూరులో గ్రామసభ



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పోత్తూరు గ్రామంలో సర్పంచ్ పట్నం అశ్విని అధ్యక్షతన గ్రామపంచాయతీలో గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో తాగునీటి సదుపాయాలు, డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, విద్యుత్ దీపాలు తదితర గ్రామ సమస్యలతో పాటు పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించి అవసరమైన సూచనలు, ప్రతిపాదనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండారి నరేష్ గౌడ్, గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మ, వార్డు మెంబర్లు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, వివిధ శాఖల సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి సర్పంచ్ కృషి అభినందనీయం

**వేద న్యూస్, సింగరేణి:**



- ఎంఈఓ దుగ్గిరాల జయరాజ్

విద్యా రంగంపై మక్కువతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్‌ను మండల విద్యాధికారి దుగ్గిరాల జయరాజ్ సోమవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంఈఓను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లిన సర్పంచ్, ఆయన చేస్తున్న అభివృద్ధి పనులను గుర్తిస్తూ ఎంఈఓ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జయరాజ్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. భాగ్యనగర్ తండాలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సర్పంచ్ హీరాలాల్‌ను కోరారు. సర్పంచ్ హీరాలాల్ స్పందిస్తూ.. గ్రామంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా పాఠశాలల రూపురేఖలు మార్చడానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అధికారులు సమన్వయంతో పనిచేసి భాగ్యనగర్ తండాను మండలంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గాంధీ, రాంబాబు, ప్రభుత్వ ఉపాధ్యాయులు బానోత్ శ్యామ్ నాయక్, లావుడ్యా లక్ష్మణ్ నాయక్, తండావాసులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పోష్ యాక్ట్ 2013ను కచ్చితంగా అమలు చేయాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోష్ యాక్ట్--2013 (కార్యస్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం) పై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోష్ యాక్ట్--2013కు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పనిచేసే ప్రదేశాల్లో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి శాఖాధిపతి, కార్యాలయ అధికారి పై ఉందని పేర్కొన్నారు. పోష్ యాక్ట్--2013 ప్రకారం 10 మంది కంటే ఎక్కువ మంది సిబ్బంది పనిచేసే ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని, అందులో 50 శాతం మహిళల భాగస్వామ్యం ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కమిటీలో మహిళా అధ్యక్షురాలు ఉండాలని, బయటి నిపుణుడిని కూడా సభ్యుడిగా నియమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని గోప్యతతో, నిష్పక్షపాతంగా, వేగంగా విచారణ చేసి పరిష్కరించాలని సూచించారు. పోష్ యాక్ట్‌పై ప్రతి ఉద్యోగికి అవగాహన ఉండేలా తరచూ శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని, పోస్టర్లు, కరపత్రాలు కార్యాలయాల్లో ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయగల వాతావరణం కల్పించడమే ఈ చట్టం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రాంరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఆర్డీఓ లు సుమారు, ఉమారాణి జిల్లా మహిళా సాధికారత కేంద్రం అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండముచ్చుతో కోతుల బెడదకు చెక్



**వేద న్యూస్, దామరచర్ల:**

మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. అడవుల్లో ఉండాల్సిన కోతులు ఆహారం కోసం గ్రామాల్లోకి వచ్చి ఇళ్లలోకి చొరబడి తినుబండారాలు, పండ్లు, కాయలు ఎత్తుకెళ్లడంతో పాటు అడ్డుకుంటే దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రామస్తులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. సహజంగా కోతులకు కొండముచ్చులు పడవు. కొండముచ్చు కనిపిస్తే చాలు కోతులు పరుగులు తీస్తున్నాయి. ఈ క్రమంలో దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామంలో కొండముచ్చులను గ్రామమంతా తిప్పుతూ కోతులను తరిమేస్తున్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో కొండముచ్చుకు షెల్టర్ ఏర్పాటు చేసి, ఆహారం కూడా పెడుతున్నారు. బైక్‌పై గ్రామమంతా తిరుగుతూ కొండముచ్చులు కోతులకు హెచ్చరికగా మారాయి. రోజూ ఇలా చేయడంతో కోతుల బెడద చాలా వరకు తగ్గిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇతర గ్రామాల్లో కూడా ఇదే తరహా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అనారోగ్య కారణాలతో గృహిణి ఆత్మహత్య

**వేద న్యూస్, మందమర్రి:**



ఆరోగ్య సమస్యల కారణంగా మానసిక వేదనకు గురై తన నివాసంలో ఉరివేసుకుని గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన మందమర్రి పట్టణంలో చోటుచేసుకుంది. సోమవారం మందమర్రి పట్టణంలోని మార్కెట్ ఏరియా ఫస్ట్ జోన్‌కు చెందిన సబ్బని విజయలక్ష్మి (53) తన నివాసంలోని బాత్రూంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త సబ్బని శేఖర్ మాజీ సింగరేణి ఉద్యోగి. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. విజయలక్ష్మి గతంలో పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పనిచేసేవారని తెలిపారు. ఏడు నెలల క్రితం విజయలక్ష్మికి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో పక్షవాతానికి సంబంధించి బ్రెయిన్ ఆపరేషన్ జరిగిందని, ఆపరేషన్ అనంతరం తలెత్తిన పలు ఆరోగ్య సమస్యల కారణంగా మానసిక వేదనకు గురై ఉపాధ్యాయ వృత్తికి కూడా స్వస్తి పలికారని చెప్పారు. ఆరోగ్య సమస్యలు అధికమవడంతో మనస్తాపం చెంది తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో బాత్రూంలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. పట్టణ ఎస్ఐ మాట్లాడుతూ, మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు.

# క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ఉపసర్పంచ్

**వేద న్యూస్, మెట్?పల్లి:**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం రాజేశ్వర్ రావుపేట్ గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఉపసర్పంచ్ ఏపూరి రచన-రాజ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ టోర్నమెంట్‌లో మొదటి విజయం బ్లూ స్టార్ యూత్ జట్టు సాధించగా, రెండో విజయాన్ని హిందూ సేన యూత్ జట్టు అందుకుంది. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని యువత 'మద్యం వద్దు.. మైదానం ముద్దు' అనే నినాదంతో క్రీడల పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు. ఆటలు యువతకు శారీరకంగా, మానసికంగా మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని, వారు ఎంచుకున్న రంగాల్లో ముందుకు వెళ్లేలా దోహదపడతాయని తెలిపారు. యువత గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ



కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాట లక్ష్మి--శ్రీధర్, వార్డు మెంబర్లు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి
- మద్యం తాగి వాహనాలు నడపొద్దు
- అర్రైవ్ అలైవ్ కార్యక్రమంలో సీఐ కిషన్



**వేద న్యూస్, మడికొండ:**

రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని మడికొండ సీఐ పుల్యాల కిషన్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మడికొండలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా 'అర్రైవ్ అలైవ్' కార్యక్రమాన్ని సీఐ కిషన్ స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్థానిక మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తిని కోల్పోతే ఆ కుటుంబం జీవితాంతం బాధ అనుభవించాల్సి వస్తుందని అన్నారు. ప్రమాదాల్లో తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధితులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకోవడం అందరినీ కలిచివేసింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు రాజబాబు, రాజ్ కుమార్, పోలీస్ సిబ్బంది, బిల్ల రవీందర్, బైరి లింగమూర్తి, పైడిపాల రఘు చందర్, దువ్వ శ్రీకాంత్, పల్లపు అర్జున్, కుర్ల మోహన్, గుర్రం అమర్నాథ్, నాగరాజు, కృష్ణారెడ్డి, కొప్పుల నవీన్, పొనగోటి వెంకటరావు, గడ్డం మహేందర్, పల్లపు యాదగిరి, కార్తీక్, అరూరి బాబు, అశోక్, దస్తగిరి, స్థానిక ఆటో డ్రైవర్లు, షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు

- కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన మొల్కపట్నం గ్రామస్తులు



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని మొల్కపట్నం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌కు సోమవారం గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు కాకుండా అనర్హులైన వారిని ఎంపిక చేశారని ఆరోపించారు. అధికారులు సర్వే చేసి అర్హులు అని చెప్పి, త్వరలో ముగ్గు పోసుకోవాలని సూచించారని, కానీ తీరా జాబితా విడుదలయ్యే సరికి అర్హులను పక్కన పెట్టి అనర్హులను ఎంపిక చేశారని తెలిపారు. గ్రామంలో సుమారు 20 సంవత్సరాలుగా నివసించని వారిని, ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న వారిని కూడా లబ్ధిదారులుగా ఎంపిక చేశారని ఆరోపించారు. రాజకీయ కక్షతోనే తమ పేర్లు తొలగించారని బాధితులు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై 15 రోజుల్లో అధికారులతో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

# రిజర్వేషన్లు తగ్గించడంపై బీసీ జేఏసీ నిరసన

- మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆందోళన
- 42 శాతం అమలు చేయాలని డిమాండ్



**వేద న్యూస్, దామరచర్ల:**

మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా తగ్గించడాన్ని నిరసిస్తూ స్థానిక మిర్యాలగూడ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ నాయకత్వంలో నిరసనకారులు కళ్లకు నల్ల గంతలు కట్టుకొని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని, అన్ని రాజకీయ పార్టీలు బీసీలను వాడుకొని వదిలేస్తున్నాయని విమర్శించారు. బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే దిశగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. సర్పంచ్ ఎన్నికల్లో కూడా బీసీలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భారీగా డబ్బు ప్రవాహం ఉంటుందని, బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తేనే ఎక్కువ మంది కౌన్సిలర్లు, చైర్మన్లు అయ్యే అవకాశం ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా బీసీలంతా పార్టీలకు అతీతంగా జనరల్ స్థానాల్లో బీసీలను బరిలో దింపి, బీసీల ఓట్లు బీసీలకే వేసుకొని జనాభా దామాషా ప్రకారం "మాకెంతైతే అంత వాటా" సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు గుండెబోయిన నాగేశ్వరావు యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్ ముదిరాజ్, కే. కోటయ్య, ఎం. ఎంకన్న, బలరాం, సోయల్ శివయ్య, కిరణ్, కిషన్, విజయ్, సతీష్, శ్రీకాంత్, కృష్ణ, శివయ్య, జాంగిర్ సత్యం, శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండికి అవార్డుల పంట



**వేద న్యూస్, చొప్పదండి:**

లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జీ రీజియన్-5 రీజియన్ కాన్ఫరెన్స్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండికి పలు విభాగాల్లో చేసిన విశేష సేవలకు అవార్డులు లభించాయి. రీజియన్ చైర్మన్ కొల్లూరి జితేందర్ ఈ అవార్డులను ప్రకటించారు. హంగర్ రిలీఫ్ (మీల్స్ ఆన్ వీల్స్), మానవతా సేవలు, శాశ్వత ప్రాజెక్ట్ (లయన్స్ ఎడ్యుకేషనల్ సర్వీస్ ట్రస్ట్), ఫండ్ రైజింగ్ కార్యక్రమాలు, మెంబర్‌షిప్ గ్రోత్ విజన్ (కంటి శిబిరాలు), పర్యావరణ కార్యక్రమాలు, డయాబెటిస్ అవేర్‌నెస్ క్యాంపులు, రక్తదాన కార్యక్రమాలు, వ్యక్తిగతీకరించిన సేవా కార్యక్రమాలు, ఫోకస్డ్ యాక్టివిటీస్, సభ్యుల వివాహ దినోత్సవ వేడుకల నిర్వహణ వంటి విభాగాల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండికి అవార్డులు ప్రకటించారు. వ్యక్తిగత అవార్డులుగా ఉత్తమ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా పెద్ద లక్ష్మీకాంతం (ఎంజెఎఫ్), ఎల్‌సీఐఎఫ్ సపోర్ట్ టీమ్ అవార్డు వల్లాల కృష్ణహరి, పర్మనెంట్ ప్రాజెక్ట్స్ అవార్డు తాటికొండ శ్రీనివాస్, ఉత్తమ కోర్ క్యాబినెట్ సభ్యుడిగా కొల్లూరి ఆనందం, డీజీ హనరింగ్ ఎంజెఎఫ్‌గా తొడుపునూరి లక్ష్మయ్య, ఎంజెఎఫ్ డొనేషన్ అవార్డు, ఉత్తమ ప్రాంతీయ కార్యదర్శిగా మహేశుని మల్లేశం, కమిటెడ్ లయన్స్ గా పాత శ్రీనివాస్, మామిడి రాజేష్ పవార్, గొల్లపల్లి నరేష్ ఎంపికయ్యారు. రీజియన్ ఉత్తమ క్లబ్‌గా లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండిని ప్రకటించగా, ఉత్తమ క్లబ్ అధ్యక్షుడిగా తొడుపునూరి సత్యనారాయణ, ఉత్తమ కార్యదర్శిగా సిరిపురం రాజు, ఉత్తమ కోశాధికారిగా పిట్టల వెంకటేష్ అవార్డులు పొందారు. ఈ అవార్డులను ముఖ్య అతిథిగా విచ్చేసిన మామిడి గిరిధర్ చేతుల మీదుగా లయన్స్ క్లబ్ సభ్యులు స్వీకరించారు.

# పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని వినతి



**వేద న్యూస్, మందమర్రి:**

మందమర్రి మండలంలోని శంకర్‌పల్లె గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతూ వార్డు సభ్యులు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ.. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరినట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వల్ల విద్యార్థుల భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాల ఆవరణలోకి బయట వ్యక్తులు సులభంగా ప్రవేశిస్తున్నారని, అలాగే జంతువుల సంచారం కూడా ఉండటంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. కావున విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని పాఠశాల చుట్టూ తక్షణమే ప్రహరీ గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ప్రథమ చికిత్స కిట్ అందజేత



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో కింగ్స్ లెవన్ పీఎల్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా క్రీడాకారులకు సోమవారం ప్రథమ చికిత్సకు అవసరమైన మందుల కిట్లను దుద్దెడ రాజు అందజేశారు. ఈ సందర్భంగా దుద్దెడ రాజు మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో ప్రవర్తిస్తూ అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఆటలు ఆరోగ్యం, స్నేహభావం, క్రమశిక్షణకు దోహదపడతాయని పేర్కొంటూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు మెడికల్ కిట్లు అందజేసినందుకు దుద్దెడ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్ రెడ్డి, అనిల్ కుమార్, సాయి, వేణు, రజినీకాంత్‌తో పాటు యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**వేద న్యూస్, మరిపెడ:**

మరిపెడ మండలం ఎస్సీ కాలనీకి చెందిన వెలుగు శ్రీరాములు కాలుకు గాయం కావడంతో గత కొన్ని రోజులుగా బాధపడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే శ్రీరెడ్డి ఎస్. రెడ్డి నాయక్ సోమవారం శ్రీరాములును ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీరాములుకు ధైర్యం చెప్పి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి నవీన్, జాటోత్ బాలాజీ, పరశు రాములు, ఎడెల్లి రవి, ఎడెల్లి సైదులు, బాసిపంగు సురేష్, ఎడెల్లి ఉప్పలయ్య, ఎడెల్లి ఇదయ్య, బాసిపంగు లక్ష్మణ్, బాసిపంగు మల్సూర్, బాసిపంగు భిక్షం, బాసిపంగు సునీల్, మిల్లు ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# బేడ బుడగ జంగాల నూతన కమిటీ ఎన్నిక



**వేద న్యూస్, కౌకుంట్ల :**

కౌకుంట్ల మండలం వెంకటగిరి గ్రామం బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి, గ్రామ శాఖ నూతన కమిటీ సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బి జి హెచ్ పి ఎస్ అధ్యక్షులు సిరివాటి జంగం రవి మాట్లాడుతూ బేడ బుడగ జంగాల హక్కుల కోసం నిరంతరం పోరాడాలి అన్నారు. కౌకుంట్ల మండల అధ్యక్షుడు సిరివాటి తిరుపతయ్య, బి జి హెచ్ పి ఎస్ వెంకటగిరి గ్రామ అధ్యక్షులుగా ఇప్ప మన్యం మాట్లాడుతూ మన కులం కోసం నాతో పాటు అందరం కలిసికట్టుగా హోర్నిశలు పోరాడి హక్కులను సాధించుకుందాం అన్నారు. అనంతరం బిజిహెచ్ పిఎస్ గ్రామ అధ్యక్షులుగా ఇప్పమన్యం, గౌరవ అధ్యక్షుడు నిడగొండ పెంటన్న ,ఉపాధ్యక్షులుగా సిరిగిరి గోపాల్, ప్రధాన కార్యదర్శి నిడగొండ బుచ్చన్న, కోశాధికారి ఇప్ప వెంకటేష్, కార్యదర్శి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దేవరకద్ర నియోజకవర్గం అధ్యక్షులు సిరివాటి జంగం రవి, మాజీ అధ్యక్షులు సిరిగిరి శీను, సిరిగిరి వెంకటేష్, గ్రామ సర్పంచ్ పోన్నకంటి లక్ష్మయ్య, సీసీ కుంట అధ్యక్షుడు గగనం శంకర్, సిరిగిరి వెంకటేష్, సిరిగిరి గోపాల్, చిత్తరి శంకర్, గణేష్, ఎల్ల స్వామి, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో స్నేహబంధాలు మెరుగుపడతాయి




**వేద న్యూస్, కౌకుంట్ల :**

కౌకుంట్ల మండల కేంద్రంలో స్వామి వివేకానంద స్మారక క్రికెట్ టోర్నమెంట్ ను గ్రామ పెద్దల సహకారంతో, గ్రామ యువకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, కౌకుంట్ల గ్రామ సర్పంచ్ ఉల్లి నరేష్, ఎం నగర్ జిల్లా కార్యదర్శి కిషన్ రావు, టి పి సి సి ఆర్గనైజింగ్ సెక్రటరీ కొత్త అరవింద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి 42 టీములు పాల్గొన్నాయి అన్నారు. డోకురుకు మొదటి బహుమతి కిషన్ రావు ట్రోఫీ తో పాటు 30 వేల నగదు ఇచ్చారు. అడ్డాకులకు రెండో బహుమతి తుమ్మల నరసింహారెడ్డి ట్రోఫీ తో పాటు 20 వేల నగదు ఇచ్చారన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమే అన్నారు. గెలుపు కోసం కృషి చేయాలి నిరాశ చెందవద్దు అన్నారు.క్రీడలు ఆడడంతో సంపూర్ణ ఆరోగ్యమంతమైన జీవితం గడుపుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి

- మహిళల అభ్యున్నతికి ఎన్నో పథకాలు
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, దామరచర్ల:**

ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించడం తనకు అన్నగా చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని మినీ రవీంద్ర భారతి వేదికగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద సోమవారం మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను సబ్ కలెక్టర్ అమిత్ నారాయణతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మహిళా ప్రభుత్వం అని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలతో మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలపరుస్తోందని తెలిపారు. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళల కోసం ఇందిరమ్మ పేరుతో ప్రభుత్వ భూమిలో ఒక భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మిర్యాలగూడ బస్టాండ్‌ను అతి త్వరలో డిజిటల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా సన్నాహాలు చేస్తున్నామని, సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. బస్టాండ్ ఎదురుగానే ప్రభుత్వ స్థలంలో మహిళా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామని కూడా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మహిళా సంఘాల నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీ కెనాల్‌లో గుర్తుతెలియని శవం లభ్యం

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి మండలం రేవెల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఎస్సారెస్పీ కెనాల్‌లో గురువారం గుర్తుతెలియని పురుషుని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ నరేష్ రెడ్డి వివరాల ప్రకారం.. మృతుడు సుమారు 40-45 సంవత్సరాల వయసు, ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు, తెలుపు శరీర రంగు కలిగి ఉన్నాడని తెలిపారు. ఒంటిపై మెరూన్ రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. కుడి చేతి భాగంలో "ఎష్ట్ర. స్వాతి" అని పచ్చబొట్టు ఉన్నట్లు వివరించారు. మృతుడి జేబులో లభించిన ఒక చీటీ ఆధారంగా అతడు బాల్కొండ వాసి చెన్న సురేష్ అయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

# ఆటో డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడపాలి

- ఎంతో మంది ప్రాణాలు వారి చేతుల్లోనే..
- డీఎస్పీ నాగేంద్రచారి
- రోడ్డు భద్రతపై అవగాహన



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ఆటో డ్రైవర్లు రోజూ వందలాది మంది ప్రయాణికుల ప్రాణ భద్రతను తమ భుజాలపై మోస్తున్నారని, అందువల్ల వారు మరింత బాధ్యతతో వ్యవహరించి ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం అందించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. రాజన్న సిరిసిల్ల పట్టణ పరిధిలోని ఆటో డ్రైవర్లకు కలశాల మైదానంలో ట్రాఫిక్ భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆటోల్లో నిర్ణయించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని హెచ్చరించారు. అలా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం నేరమని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం, సీట్‌బెల్ట్, హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి డ్రైవర్ వేగ పరిమితులు పాటిస్తూ, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచిక బోర్డులను గమనిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలి, బాధితులకు ప్రాథమిక సహాయం ఎలా అందించాలి అనే అంశాలపై కూడా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఆడ్తి దారుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎర్రబెల్లి రాజేశ్వరరావు



**వేద న్యూస్, జమ్మికుంట :**

స్థానిక ఆడ్తి దారుల భవనంలో అడ్తిదారులు అందరూ సోమవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు . గౌరవ అధ్యక్షునిగా పాకాల రవీందర్ రెడ్డి, అధ్యక్షునిగా ఎర్రబెల్లి రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మర్రి రామ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుత్తి కుమార్, కోశాధికారిక రావికంటి సత్యనారాయణ, ముఖ్య సలహాదారునిగా కందాల తిరుపతి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాల నుండి ఆడ్తి దారుల సంక్షేమానికి కృషి చేస్తున్నానని, అదేవిధంగా ఎల్లవేళలా వారి అందుబాటులో ఉంటూ వారి క్షేమాలు చూసుకుంటానని చెప్పారు . తనపై నమ్మకంతో నాలుగవసారి అధ్యక్షునిగా అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య, వొళ్ళల బాపుశట్టి, మామిడాల మనోహర్, పోల్సాని సంపత్ రావు, జనార్దన్ రెడ్డి, రాకం రమేష్, కడారి రవి, ఎగితా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కుర్రెఘడ్‌లో ఘనంగా లింగు స్వామి జాతర

**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కుర్రెఘడ్ గ్రామంలో గోండీ ధర్మ గురువు పాహుండి కుపార్ లింగు స్వామి జాతర దర్బార్ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు కాసిపేట మండలంతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇది మండలంలో ఏటా జరిగే విశిష్ట ఆదివాసీ సంప్రదాయ కార్యక్రమంగా గుర్తింపు పొందింది. స్థానిక ఆదివాసీలు సంప్రదాయ పూజలు నిర్వహించగా, ఆదివారం రాత్రి జరిగిన అగ్నిగుండం కార్యక్రమంలో భక్తులు అగ్నిగుండంలో నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్య అతిథిగా దేవాపూర్ ఓరియంట్ అదాని సిమెంట్ కంపెనీ యూనియన్ అధ్యక్షుడు కొకిరాల సత్యపాల్ రావు హాజరై, ఆదివాసీ సంస్కృతి ప్రకృతిని పూజించే జీవన విధానమని అన్నారు. ఈ తరహా సంప్రదాయ కార్యక్రమాలకు అవసరమైన మౌలిక సదుపాయాలకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కంపెనీ జీఎం మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగడం అభినందనీయమని, కంపెనీ తరఫున అవసరమైన సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తామని తెలిపారు. లింగు స్వామి సేవకుడు గురు స్వామి కుర్సింగా భూదే షా ఆధ్వర్యంలో జాతర కార్యక్రమాలు నిర్వహించగా, యూనియన్ అధ్యక్షుడు సత్యపాల్ రావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆదివాసీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల అమ్మకంపై రైతుల ధర్నా

వేద న్యూస్, ముస్తాబాద్:

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని ఆవునూర్ గ్రామంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నారని ఆరోపిస్తూ రైతన్నలు సోమవారం రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. ఆవునూర్ గ్రామంలోని శ్రీలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణం నకిలీ విత్తనాలు విక్రయించడంతో దాదాపు 100 ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, వ్యవసాయ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ దుకాణాలను ఇప్పటికైనా గుర్తించి సీజ్ చేయాలని, రైతులకు మరింత నష్టం వాటిల్లకుండా చూడాలని కోరారు. ఒక్కో బస్తాను రూ.1,450కు విక్రయించి నష్టపోయిన రైతులకు ఫర్టిలైజర్ షాప్ యజమాని కేవలం రూ.800 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు కోరారు.

# అభాగ్యుల రక్షణ కోసం..

- కదిలిన అధికార యంత్రాంగం
- వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ
- పోలీస్, రెవెన్యూ, దేవస్థాన అధికారుల ప్రత్యేక డ్రైవ్



**వేద న్యూస్, వేములవాడ:**

బడుగు, బలహీన వర్గాలు, రక్షణ లేని వారు, వెలివేయబడిన వారి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి డే కేర్ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తూ వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. దీనిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశాలతో పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖలు, దేవస్థాన అధికారులు సమన్వయంతో జిల్లా సంక్షేమ శాఖ పర్యవేక్షణలో దేవస్థాన ప్రాంగణ పరిధిలో యాచకులను, రక్షణ అవసరమైన వారిని గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మొత్తం 74 మందిని గుర్తించారు. వీరిలో ఒక పాప బాబు (ఇద్దరు పిల్లలు), 20 మంది ట్రాన్స్‌జెండర్లు, 52 మంది ఒంటరి మహిళలు, వృద్ధులు ఉన్నారు. ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కొంతమంది వృద్ధులను వారి సంతానం వదిలివేసినట్లు గుర్తించగా, ఈ విషయాన్ని రెవెన్యూ శాఖకు తెలియజేశారు. వయోవృద్ధుల తల్లిదండ్రుల పోషణ-సంరక్షణ చట్టం ప్రకారం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు భక్తులను ఇబ్బంది పెట్టకూడదని, యాచన చేయరాదని సూచించారు. దేవాలయ పవిత్రతను భంగం చేస్తూ భిక్షాటనకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా వ్యవహరించాలని ఆలయ ప్రాంతంలో ఉన్నవారికి సూచించారు. ఆలయ పరిసరాల్లో లేదా జిల్లాలో ఎక్కడైనా పిల్లలు భిక్షాటన చేస్తున్నట్లు లేదా బాల కార్మికులుగా కనిపిస్తే 1098కు, మహిళలు లేదా వయోవృద్ధులు రక్షణ అవసరమైన స్థితిలో కనిపిస్తే 181 టోల్ ఫ్రీ నంబర్‌కు, లేదా 100 / 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డి. చంద్రయ్య, జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం, సీడబ్ల్యూసీ చైర్మన్ సి. అంజయ్య, సీడీపీఓలు సౌందర్య, ఉమారాణి, డీసీపీఓ కవిత, డి హబ్ స్టాఫ్ రమ్య, తహసీల్దార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలి
- ప్రజా సంక్షేమానికి పథకాల అమలు
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**వేద న్యూస్, వేములవాడ:**



సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ఇందిరా మహిళా శక్తి పథకం ఉద్దేశ్యమని, ఇప్పటి వరకు మూడు విడతల్లో ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని 1,295 స్వయం సహాయక సంఘాలకు రూ.4 కోట్ల 64 లక్షల 68 వేల 771 వడ్డీ లేని రుణాల చెక్కులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూడో విడతలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 903 ఎస్‌హెచ్‌జీలకు రూ.3 కోట్ల 18 లక్షల 49 వేల 135, వేములవాడ మున్సిపల్ పరిధిలో 392 ఎస్‌హెచ్‌జీలకు రూ.1 కోటి 46 లక్షల 19 వేల 636 లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని వెల్లడించారు. అలాగే వేము లవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు వందల కోట్లతో పనులు చేపట్టామని తెలి పారు. రాజరాజేశ్వర స్వామి దేవా లయ అభివృద్ధికి రూ. 150 కోట్లు, రోడ్డు వెడల్పు పనులకు రూ.47 కోట్లు, సుందరీకరణ పనులకు రూ.2.65 కోట్లు మంజూరు చేశామని వివరించారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, మహిళల ఆర్థిక ప్రగతితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రభుత్వ పథకాలలో మహిళలను భాగస్వాములుగా చేస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు రాజు, స్వరూపారెడ్డి, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, శేషాద్రి, తహసీల్దార్ విజయప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని గ్రామాల నర్సరీల్లో విత్తనాలు నాటాలి



**వేద న్యూస్, కమలాపూర్:**

- కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు

మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో ఎర్ర మట్టిని తెప్పించి బ్యాగుల్లో నింపి, విత్తనాలు సేకరించి నాటాలని కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు సూచించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శంభునిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న నర్సరీని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి క్షేత్ర సహాయకుడు ఈ సంవత్సరం మార్చి 31 వరకు ఉపాధి హామీ కూలీలకు 7,000 పని దినాలు కల్పించాలని ఆదేశించారు. రెండు రోజుల్లో నర్సరీలను పూర్తిస్థాయిలో శుభ్రంగా ఉంచుకోవాలని, అలా చేయని పక్షంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే హెచ్చరికలు చేసినప్పటికీ కొందరు గ్రామస్థాయి సిబ్బంది తమ తీరును మార్చుకోవడం లేదని, సరిగా స్పందించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై కూడా నిర్లక్ష్యం కొనసాగితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శంభునిపల్లి గ్రామ క్షేత్ర సహాయకుడు మోడెం తిరుపతి, వన సేవకులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# రూల్స్ పాటిద్దాం-ప్రమాదాలు నివారిద్దాం

**వేద న్యూస్, ఇల్లందకుంట:**






రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు, మరణాల తగ్గింపే లక్ష్యంగా డీజీపీ శివధర్‌రెడ్డి ఆలోచన మేరకు 'అరైవ్-అలైవ్' కార్యక్రమాన్ని పోలీస్ శాఖ చేపట్టింది. ఈ ప్రోగ్రామ్ లో భాగంగా సోమవారం ఇల్లందకుంట మండలకేంద్రంలో రోడ్డు భద్రతపై ఇల్లందకుంట ఎస్ఐ ఎం.క్రాంతి కుమార్ ప్రజలకు అవగాహన కల్పించారు. గత మూడేండ్ల నుంచి యాక్సిడెంట్స్ జరుగుతున్న ప్రదేశాలు(బ్లాక్ స్పాట్స్) గురించి తెలిపారు. ముఖ్యంగా టర్నింగ్ పాయింట్స్, జంక్షన్‌ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించి.. ఆయా బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రయాణికులు జాగ్రత్తగా వెళ్లాలని చెప్పారు. ఆయా బ్లాక్ స్పాట్స్ వద్ద యాక్సిడెంట్స్ బాధితులు, ప్రయాణికులందరికీ ఎస్ఐ అవగాహన కల్పించారు. డిఫెన్స్ డ్రైవింగ్ చేయాలని ప్రతీ ఒక్కరికీ అర్థమయ్యేలా వివరించారు. గతంలో జరిగిన పొరపాట్లపై ప్రజలకు, ప్రయాణికులకు స్పష్టంగా వివరించారు. డిఫెన్స్ డ్రైవింగ్‌పై అవేర్‌నెస్ కల్పించారు. మానవ తప్పిదాల వల్లే 90 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, కాబట్టి ప్రజలు ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ.. డిఫెన్స్ డ్రైవ్ చేయాలన్నారు. అరైవ్ అలైవ్ ప్రోగ్రామ్ క్యాంపెయిన్‌లో భాగంగా వివిధ రంగాల వారికి.. వివిధ వ్యక్తులకు వేర్వేరు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

# బహుజనుల ఐక్యత చాటి చెబుదాం



- పరకాల మున్సిపాలిటీలో పోటీ చేస్తాం- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్

**వేద న్యూస్, హనుమకొండ:**

నీలి జెండా ఎగరవేసి బహుజనుల ఐక్యతను చాటి చెప్పాలని బీఎస్పీ హనుమ కొండ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్ పిలుపునిచ్చారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రం శేఖర్ ఆదేశానుసారం, రాష్ట్ర కోఆర్డి నేటర్ దాగిళ్ళ దయానందరావు సూచన మేర కు సోమవారం బీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబాల ప్రశాంత్ మాట్లాడుతూ, పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బహుజనుల ఐక్యత ముందు ఎంతటి శక్తివంతులైనా తల వంచక తప్పదని అన్నారు. పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో బీఎస్పీ పోటీ చేస్తుందని ఈ సమావేశం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. బహుజనులు అంతా ఒక్కటై పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీకి మద్దతు ఇచ్చి, బహుజనుల ఐక్యతను చాటి చెప్పాలని, అలాగే అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్?చార్జి శనిగరపు రాజు, బొట్ల భరత్, కర్రే రమేష్, విష్ణు, ముత్యాల నరేందర్, గ్గని రవీందర్, నద్దునూరి దీపక్, ముకినిపల్లి వరుణ్‌తో పాటు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073